క్లుప్తంగా

ఓటర్ స్లిప్‌ల పంపిణీ



ఓటర్ స్లిప్‌లు పంపిణీ చేస్తున్న బీఎల్‌ఓ రాధ

అర్వపల్లి : ఈనెల 27న జరగనున్న నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండలంలోవివిధ గ్రామాల్లో పట్టభద్రులైన ఓటర్లకు బీఎల్‌ఓలు ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేస్తున్నారు. ఆదివారం తిమ్మాపురం, అర్వపల్లి, వేల్పుచర్ల, లోయపల్లి తదితర గ్రామాల్లో ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు మాట్లాడుతూ.. మండలంలో 1,302మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని, ప్రతి ఒక్కరికి ఇంటింటికి తిరిగి ఓటర్ స్లిప్‌లు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు జీడి రాధ, ధనలక్ష్మి, నాగమ్మ, భాగ్యమ్మ, పరమేశ్వరి, నవనీత, సునంద తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న కడియం రామచంద్రయ్య

నాగారం : మండల కేంద్రానికి చెందిన చిప్పలపల్లి రాజు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య ఆదివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు మొల్కపురి చిరంజీవి, మాజీ సర్పంచ్ కుంభం కర్ణాకర్, దేశగాని నర్సయ్య, లక్ష్మయ్య, కిరణ్, మహేష్, మల్లేశం, సోమేష్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నూతనకల్ : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మండల పోలీసులు ఆదివారం పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తాళ్లసింగారం గ్రామశివారులోని పాలేరు వాగు నుంచి అనుమతులు లేకుండా గ్రామానికి చెందిన జటంగి సోనయ్య ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వెంకన్న మృతికి సంతాపం

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అనాజిపురం గ్రామానికి చెందిన గౌరైలకాపరి మట్టపల్లి వెంకన్న పిడుగుపాటుకు గురై శనివారం మృతి చెందారు. ఆదివారం సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో వెంకన్న మృతదేహాన్ని మాజీ మంత్రి, సూర్యాపేట కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు కొప్పుల వేణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, మిడిమేలపు దామోదర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కూలీలకు బిల్లులు చెల్లించాలి

అర్వపల్లి : ఉపాధిహామీ పథకం కూలీలకు బిల్లులను వెంటనే చెల్లించాలని ఉపాధి కూలీల సంఘం రాష్ట్ర కమిటీ గౌరవ అధ్యక్షుడు మచ్చ నర్సయ్య కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొన్ని వారాలుగా బిల్లులు పెడింగ్‌లో ఉండటంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గండూరి కృపాకర్

సూర్యాపేటటౌన్ : క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, విద్యార్థిని విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకొని గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్ అన్నారు. పట్టణంలోని కిరాణా ఫ్యాన్సీ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్ 7, 13, 17 బాల బాలికల చెస్ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. చదరంగం విద్యార్థుల మేధాశక్తిని పెంపొందిస్తుందన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను మెరుగుపరుచుకునేందుకు ఇలాంటి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. అనంతరం అండర్ -7 బాలికల విభాగంలో శాన్వి కార్తీక, బాలుర విభాగంలో యజత్‌రెడ్డి, అండర్-13లో అనంతలక్ష్మి, బాలుర విభాగంలో కమల్‌తేజ్, అండర్-17 బాలికల విభాగంలో దివ్య భవానీ, బాలుర విభాగంలో సాయి శ్రీనిత్‌రావులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్, లైన్స్ క్లబ్ మాజీ సెక్రటరీ బెజగం ఫని, చైర్మన్ ముద్ద భిక్షపతియాదవ్, లింగారెడ్డి, వెంకటమురళి పాల్గొన్నారు.

సుందరయ్య జీవితం ఆదర్శనీయం



పెన్‌పహాడ్ : సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న నెమ్మాది వెంకటేశ్వర్లు



నూతనకల్ : సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెన్‌పహాడ్ : సీపీఎం నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం మండల పరిధిలోని గాజులమల్కాపురం గ్రామంలో సుందరయ్య 39వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడారు. కష్టజీవుల కోసం తుదిశ్వాస వరకు పోరాడిన మహనీయుడని తెలిపారు. నీతినిజాయితీలకు నిరాడంబరతకు, త్యాగానికి మారుపేరు సుందరయ్య అని, ఆయన ఆశయాలను నేటి యువత పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలంగాణ జన సమితి ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ బచ్చలకూరి గోపి, బెల్లంకొండ శ్రీరాములు, బండి రామకృష్ణారెడ్డి, బచ్చలకూరి వెంకయ్య, సైదులు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

భానుపురి (సూర్యాపేట) : పట్టణంలో పూర్వ మిత్ర మండలి ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ పూర్వ మిత్రమండలి అధ్యక్షుడు నల్లకుంట్ల అయోధ్య, కార్యదర్శి భయ్యా మల్లిఖార్జున్, ఉపాధ్యక్షుడు నల్లపాటి అప్పారావు, సహాయ కార్యదర్శి తన్నీరు యాదగిరి, అరుణజ్యోతి, దాసరి సత్యనారాయణ, వరికుప్పల వెంకన్న, షేక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : మండలంలోని అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం గ్రామాల్లో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలను సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, శిగ వెంకన్న, కొమ్ము విజయ్‌కుమార్, సైదులు, దేవరకొండ బాలయ్య, సూరు యాదగిరి, శ్రీకాంత్, అబ్బులు, భద్రయ్య, వజ్జె సైదయ్య, రామచంద్రు, శిగ రవి, శ్రీను, చెన్నబోయిన వీరయ్య, చిన్న సోమయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయ సాధనకు కృషిచేయాలి

నూతనకల్ : పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి కోరారు. ఆదివారం మండల పరిధిలోని చిల్పకుంట్లలో గ్రామంలో నిర్వహించిన సుందరయ్య 39వ వర్ధంతి వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తొట్ల లింగయ్య, గునగంటి లింగయ్య, బాణాల విజయ్‌రెడ్డి, బాణాల శివారెడ్డి, తొట్ల శ్రీను, ఎల్లావుల నరేష్, మహేష్, దాసరి వీరయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లిలో సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



జాజిరెడ్డిగూడెంలో..

ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలి

- ఎమ్మెల్యే మందుల సామేల్

అర్వపల్లి : ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే మందుల సామేల్ కోరారు. మండల పరిధిలోని వేల్పుచర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమైసమ్మ ఆలయ ఉత్సవాల్లో ఆదివారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ, మండల అధ్యక్షులు వేల్పుల రమేష్, శిగ నసీర్‌గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, బైరబోయిన మహారాజు, గుడిపల్లి మధుకర్‌రెడ్డి, దాసరి సోమయ్య, నిర్వాహకులు రవీందర్, శైలేందర్, చిక్కుల శేఖర్, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నాగారం : మండల కేంద్రానికి చెందిన చిప్పపల్లి రాములు, నిమ్మల పిచ్చయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదివారం మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిప్పపల్లి రాజు కుటుంబ సభ్యులకు పరామర్శించి రూ.10వేలు, చిప్పలపల్లి రాములు కుటుంబ సభ్యులకు రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు కన్నెబోయిన వెంకటభిక్షం, జాజుల వీరయ్య, మంగదుడ్ల దశరథ, కొలిపాక సాయికుమార్, సుధాకర్, ఆకారపు కృష్ణ, పరుశరాములు, సైదులు, చంద్రశేఖర్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి : ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

నూతనకల్ : మండల పరిధిలోని అల్లునూరు గ్రామానికి చెందిన మల్లేబోయిన కాటమయ్య, దుండిగాల లింగరాజుకు చెందిన గేదెలు విద్యుదాఘాతంతో ఇటీవల మృతి చెందాయి. దీంతో బాధిత రైతులను ఆదివారం ఎమ్మెల్యే మందుల సామేల్ పరామర్శించారు. బాధితులకు విద్యుత్‌శాఖ ద్వారా బీమా డబ్బులు వచ్చే విధంగా కృషి చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు జెన్నారెడ్డి వివేక్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, భూరెడ్డి సంజీవరెడ్డి, కళ్లెం కృష్ణారెడ్డి, కట్టా మల్లారెడ్డి, ఉప్పుల పాపయ్య, దరిపెల్లి వీరన్న, మెంచు చక్రయ్య, బంటు బద్రి, పసుల అశోక్ యాదవ్, క్రాంతి తదితరులు ఉన్నారు.



నాగారంలో నిమ్మల పిచ్చయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయం



సూర్యాపేట టౌన్ : సమావేశంలో మాట్లాడుతున్న చింత వెంకన్న



తిరుమలగిరిలో కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్ : నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయమని నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు చింత వెంకన్న పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో తీన్మార్ మల్లన్న గెలుపును కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. నిరుద్యోగులకు న్యాయం జరగాలంటే విద్యావంతులుగా తీన్మార్ మల్లన్నను ఆదరించి చట్టసభలకు పంపించాల్సిన ఆవశ్యకత నిరుద్యోగులపై ఉందని తెలిపారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు ఆటంకంగా పరిణమించిన 46జీవో, ఉద్యోగులను చిన్నాభిన్నం చేసే విధంగా తీసుకొచ్చిన 317జీవోను రద్దు చేసేందుకు హామీ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో పిల్లి శ్రీనివాస్, సతీష్, దివ్య, దశరథ, రవి, తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

తిరుమలగిరి (తుంగతుర్తి) : నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్సోజు నరేష్ కోరారు. ఆదివారం తిరుమలగిరిలో ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచార కరపత్రాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. పది సంవత్సరాలుగా ప్రశ్నించే గొంతుకలుగా పనిచేస్తున్న తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పేరాల వీరేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, అమరేందర్‌రెడ్డి, జనార్దన్, శాగంటి రాములు, జమ్మిలాల్, మల్లయ్య, లక్ష్మయ్య, రాములు నాయక్, సుధాకర్, లింగయ్య, వంశీ, నవీన్, శ్రీనివాస్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాకేష్‌రెడ్డిని గెలిపించాలి

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి

తిరుమలగిరి (తుంగతుర్తి) : నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి కోరారు. ఆదివారం తిరుమలగిరిలో తుంగతుర్తి నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాకేష్‌రెడ్డిని గెలిపించడానికి పార్టీ నాయకులు కృషి చేయాలని కోరారు. పట్టభద్రుల ఎన్నికల్లో రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయించాలన్నారు. ఉద్యోగులు, యువతను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలన్నారు. గతంలో 4 పర్యాయాలు బీఆర్ఎస్ అభ్యర్థే ఎమ్మెల్సీగా గెలిచారని, ప్రశ్నించే గొంతుకను శాసన మండలికి పంపించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాకేష్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో టికెట్ ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలతో కొత్తగా ఒరిగిందేమి లేదని, రెండు పార్టీలు అధికారం కోసం పాకులాడటం తప్ప ప్రజల అవసరాలు, కష్ట సుఖాలు పట్టవన్నారు. రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజమని, ప్రజా తీర్పు అంగీకరించక తప్పదన్నారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి మాట్లాడారు. హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. పట్టుదలతో పని చేస్తే ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం తథ్యమన్నారు. నిరుద్యోగులకు రూ.4వేల భృతి ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ మాట్లాడుతూ.. 3నెలల్లో 30వేల ఉద్యోగాలు కల్పించామంటూ సీఎం పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న మోసానికి తగిన బుద్ధి చెప్పడానికి నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సమావేశంలో మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జా దీపికాయుగేంధర్‌రావు, గెల్లు శ్రీనివాస్, రజాక్, దూపటి రవీందర్, కొమ్మినేని సతీష్, వీరప్రసాద్, సీతయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

కోదాడ : బీసీ డిక్లరేషన్ అమలు తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ (టీఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎం శ్రీకాంత్‌యాదవ్ కోరారు. ఆదివారం కోదాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో నిర్వహించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం జనగణన చేసిన అనంతరం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 2 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. సామాజిక న్యాయం గురించి నిత్యం చెపుతున్న కాంగ్రెస్ పార్టీ బలహీన వర్గాలకు అన్యాయం చేసేవిధంగా పదవుల్లో అగ్రవర్ణాలకే పెద్దపీట వేస్తుందని ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని లేని పక్షంలో బీసీలంతా ఏకమై ఉద్యమిస్తారని హెచ్చరించారు.

జనార్దన్ వర్ధంతి సభను జయప్రదం చేయాలి




ఆత్మకూర్(ఎస్) : సమావేశంలో మాట్లాడుతున్న కునుకుంట్ల సైదులు


ఆత్మకూర్(ఎస్) : సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు జలగం జనార్దన్ (జన్నుసార్) మూడో వర్ధంతిని జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జెన్నుసార్ వర్ధంతి సభను విజయవంతం చేయాలని కోరుతూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని ఏపూరు గ్రామం ప్రతిఘటన పోరాటాల నుంచి జననేత జలగం జనార్దన్ (జానకిరాములు), కమ్యూనిస్టు విప్లవకారుడిగా కష్టజీవుల పక్షాన దున్నేవాడికే భూమి కావాలని భూస్వామ్య రాజకీయ పెత్తందారులకు కంటగింపు అయ్యాడు అన్నారు. సమావేశంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య, పార్టీ సబ్ డివిజన్ నాయకులు డేగల వెంకటకృష్ణ, గునుగంటి శీను, నాగయ్య, చల్ల రవీందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : ఈనెల 21న సూర్యాపేటలో కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు జలగం జనార్దన్ 3వ వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా సభ విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం జాజిరెడ్డిగూడెంలో కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. జనార్దన్ చిన్నతనం నుంచి పేద ప్రజల సంక్షేమం కోసం పోరాడి చివరకు కరోన మహమ్మారితో ప్రాణాలు వదిలారని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, న్యూడెమోక్రసీ సబ్‌డివిజన్ నాయకుడు పోలెబోయిన పెదలింగయ్య, గ్రామకార్యదర్శి వడకాల బయ్యన్న, మధుకర్, సురేష్, వీరేష్, విజయ్, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగారం : సూర్యాపేట పట్టణంలో చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 21న నిర్వహించే సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ప్రతిఘటన పోరాటయోధుడు జె.జనార్దన్ (జన్నుసార్) 3వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఆపార్టీ సబ్ డివిజన్ నాయకుడు బయ్యం లింగయ్య కోరారు. ఆదివారం మండల పరిధిలోని డి.కొత్తపల్లి స్టేజీ వద్ద జనార్దన్ వర్ధంతి సభ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. జెన్నుసార్ 40ఏళ్ల పాటు విప్లవోద్యమంలో, 14ఏళ్ల పాటు రహస్య జీవితం గడిపారని తెలిపారు. భూస్వామ్య వ్యవస్థ రద్దు కోసం, దోపిడీ, పీడన, అణిచివేత లేని సమాజం కోసం నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం ప్రజలను ఐక్యం చేసి ప్రజా పోరాటాలు నిర్వహించడంలో ముందున్నారని కొనియడారు. గ్రామాల్లో పేద ప్రజలపై పెత్తందార్ల, భూస్వాముల, దొరల ఆగడాలను వ్యతిరేకంగా భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు నిర్వహించిన గొప్ప మనిషి అని అన్నారు. జెన్ను సార్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యానాల సుధాకర్‌రెడ్డి, పెరమళ్ల నర్సయ్య, గంద్ర కళింగరెడ్డి, లింగాల చిన్న యాదయ్య, శ్రీను, సతీష్, శేఖర్, శ్రీను, సంజీవ పాల్గొన్నారు.



జాజిరెడ్డిగూడెంలో సభ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు



నాగారం : కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు, సౌరహోమం



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురంలో గల అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద సత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు కాకులారపు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ, భక్తులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రాన్ని సందర్శించిన సూర్యాపేట ఆర్డీఓ

జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురంలో గల సూర్యక్షేత్రాన్ని ఆదివారం సూర్యాపేట ఆర్డీఓ ఆర్‌వై.వేణుమాధవరావు దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం క్షేత్ర విశిష్టతను క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌స్వామి తెలియజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు నరేష్, ఇంద్రారెడ్డి, అర్చకులు రామశర్మ, వేణుగోపాలశర్మ పాల్గొన్నారు.

కోదాడలో 'కర్మ' షూటింగ్

కోదాడరూరల్: శ్రీవెంకటేశ్వర మూవీ మేకర్స్ బ్యానర్‌పై బేబీ లిఖిత సమర్పణలో నిర్మిస్తున్న కర్మ అనే లఘు చిత్ర షూటింగ్‌ను ఆదివారం కోదాడ పట్టణంలోని కోదండ రామాలయంలో పీసీసీ సభ్యుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిత్ర బృందంతో కలిసి ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్మాత మచ్చ ఉపేందర్, డైరెక్టర్ తిరుప్ ఏర్పుల, నటీనటులు విజేతసాయి, నానిప్రతాప్, శ్రీరంగం శ్రీనివాస్, నిస్సీ, అనుతో పాటు పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, వంగవీటి రామారావు, నరేష్, డేగ శ్రీధర్, గంధం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నడిగూడెం : మండల పరిధిలోని రత్నవరంలో గల హరిహర క్షేత్రంలో ఆదివారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, మంగళవాయిద్యాలతో మామిడి తోరణాలు కట్టుట, గణపతి పూజ తీర్థప్రసాదాల వితరణ, భూదేవి కల్యాణం, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

పేద ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న శివకుమార్

భానుపురి (సూర్యాపేట) : పేద ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ పనిచేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణం పరిధిలోని తూర్పుగూడెం గ్రామానికి చెందిన పలువురు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ చేపడుతున్న ఉద్యమాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు పార్టీ విభేదిస్తుందని, పేద ప్రజలను చైతన్యపరిచి వారి హక్కులు దక్కేలా ఉద్యమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి రేణుక, నాయకులు అఖిల్, నాగన్న, సయ్యద్, లింగన్న పాల్గొన్నారు.

నేడు హుజూర్‌నగర్‌కు ఈటల రాజేందర్ రాక

హుజూర్‌నగర్ : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ సోమవారం హుజూర్‌నగర్ వస్తున్నట్లు ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ అంబళ్ల నరేష్ ఆదివారం తెలిపారు.

తాగునీరందక అవస్థలు..!

- సరఫరా కాని మిషన్ భగీరథ, పంచాయతీ బోరునీరు
- ట్యాంకర్లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి
- ఇబ్బందులు పడుతున్న తండావాసులు



ట్యాంకర్ ద్వారా నీటిని పట్టుకుంటున్న బోర్యాతండావాసులు

ఆత్మకూర్(ఎస్) : గ్రామాలకు, తండాలకు తాగునీరు సక్రమంగా రాకపోవడంతో వేసవిలో నీటి కోసం ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు, గ్రామపంచాయతీ బోర్ నీళ్లు సక్రమంగా సరఫరా కాక ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకొని కాలం వెళ్లదీస్తున్నారు. మండలంలోని బోట్యాతండా గ్రామపంచాయతీలో గత వారం పది రోజులుగా మిషన్ భగీరథ నీరు, గ్రామపంచాయతీ బోర్ల నీరు రాకపోవడంతో గ్రామస్తులు ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకుంటుని దాహాన్ని తీర్చుకుంటున్నారు. ఈ విషయమై అధికారులు పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నీళ్లు లేకపోవడంతో పనులు సాగడం లేదని, పలువురు వ్యవసాయ బావుల వద్ద నుంచి తెచ్చుకుంటున్నారని, మరికొందరు బైక్‌లతో, ఆటోలలో దూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటున్నామని వాపోతున్నారు. డబ్బులు పెట్టి ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి వస్తుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి తండాకు మిషన్ భగీరథ నీరు గాని, గ్రామపంచాయతీ బోర్ల ద్వారా గాని నీటిని సరఫరా చేసి ఇబ్బంది లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆటోల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నాం

15రోజులుగా తండాకు తాగునీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వ్యవసాయ బావులకు వద్దకు వెళ్లి ఆటోల్లో, ద్విచక్రవాహనాలతో నీటి తెచ్చుకోవాల్సి వస్తుంది. ఈ విషయమై అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. వెంటనే గ్రామానికి తాగునీరు అందించి ఆదుకోవాలి.

– గుగులోత్ అశోక్

నీటి సౌకర్యం కల్పించాలి

గ్రామానికి 15రోజులుగా తాగునీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుంది. నీరు లేక ఏం పనులు సాగడం లేదు. వ్యవసాయ బావుల వద్దకు పోయి నీటిని తెచ్చుకోవాల్సి వస్తుంది. కొంతమంది ట్యాంకర్ల ద్వారా తెచ్చుకుంటున్నారు. అధికారులు వెంటనే నీటి సౌకర్యం కల్పించాలి.

– భూక్య ధ్వాలి